“నా జాతకం తిరిగింది, ఉత్తసందేహాలతో నన్ను పొమ్మన్న సుందరి నన్నఠాత్తుగా నీ బోధచేత అంగీకరించింది ఈవేళ. మా యిద్దరి వందనాలు. ఇద్దరం వెళ్ళిపోతున్నాము. కాఫీహోటలుబాకీకి పైకం లేదు. నువ్విచ్చెయ్యి.

హనుమంతరావు.”

౨. వొంటరితనం

యెంత రాత్రైనా యింటికి వెళ్ళడమంటే, దిగులు పుట్టించే, యెండాకాలపు సాయంత్రమది. దక్షిణపు గాలితో కంఠం కలిపి సూర్యనారాయణ పాడుతో వుంటే యింటికి రావడం ఆలిశ్యమయిందని రెండు గంటలసేపు మాట్లాడకండా, మొహం ముడుచుకునే భార్యా, రాక్షసులవలె తగూలాడే నలుగురు పిల్లలూ, నాటకంలో హిరణ్యకసిపుడివలె కోర్టంతా తన రంగస్థలం లాగు చూసుకుని నాట్యమాడే శిరద్దారూ, లోకంలో వున్నారనే సంగతినే మరిచిపోయి, గానప్రపంచ వీధుల్లో స్వేచ్ఛావర్తనం సల్పుతున్నాను. కాని కడుపులో చురచుర, పెరుగుపచ్చడినీ, పప్పుపులుసునీ, దానితోటి రాచిప్పనీ, దీపంశెమ్మానీ, వంటింటిని, భార్యానీ, జ్ఞాపకానికి తెచ్చింది.

“లేద్దాం” అన్నాను, కష్టంమీద, దిగులుతో.

"యేం అంత తొందర!" అన్నాడు ఒకడు.

"కడుపులో మండుతుంది" అన్నాను.

"వీడు యెప్పుడూ యిట్లానే తొందర పడతాడు. ఏదో యింటిదగ్గిర అనుమానం యేడిపిస్తోంది"

"అనుమానముంటే మాత్రం; యేంచేస్తాడేం?"

"కనుక్కొని రూఢిచేసుకుంటాడు, తొరగాపోయి."

"అట్లా అనుమానంగా వుంచితేనే మంచిది. రూఢి చేసుకుంటే అదో తంటా"

"తంటా యేముంది? యిద్దర్నీ పక్కలువిరగతంతాడు"

"తంతాడు? తన్నడమే! యిట్లాంటి వాళ్ళని చాలా మందిని చూశాం"

"లేకపోతే, వూరుకుంటాడా ?

"యెవరో చాతగాని ఆడముండ వూరుకోవాలి గాని, మనవాడు......"

"మొగరాక్షసుడైనా యేమీ చెయ్యలేడు. భార్యనీ, విటుణ్ణీ కసిదీరా స్వేచ్ఛగా కండలు చెక్కేకాలం దాటిపోయింది. యెంతకాలమని భార్యని తాళాలు వెయ్యగలడు? అందులో పిల్లలతో సహా అడ్డపెట్టడం అసాధ్యం. బైటపెడితే పరువునష్టం............అదంతా యెందుకు ? యిందాక నలుగురు చక్కని పిల్లల్ని వెంటబెట్టుకు యిట్లా వెళ్ళలా, ముసలాయన. ఆయన సంగతేమయింది చెపుదూ? మళ్లీ యవ్వనంలో వున్నప్పుడు మనుషుల్ని కాల్చుకుతినేవాడిలాగ కనపడేవాడు! పోలీసుడిప్టీసూపరిండెంటుపని...... మొదటినించి చెపుతాను వినండి. యీసారి ఆయన కనపడ్డప్పుడు ఆ పెద్ద

పిల్లల ముగ్గురి మొహాలు చూడండి; ఆచివరదాని మొహం చూడండి. నాకధ వాస్తవం మీకే తేలుతుంది.

ఆయనపేరు వెంకటబ్రహ్మం. ఆపేరు చెపితే చాలు, దొంగలకేకాదు, మంచివాళ్ళకీ, మేస్ట్రేటుకీ, తక్కినయిన స్పెక్టర్లకీ హడలు. కాని యింటికి వెళ్ళగానే అతని తీరేమారి పోయేది. చంటిపిల్లవాడై తన పిల్లలతో ఆటలు, గంతులు, వీటితో కాలం గడిపేవాడు. పిల్లలే అతనికి ప్రాణం. వాళ్ళ కోసమే జీవించేవాడు. ఆస్తి, డబ్బు, ఉద్యోగం, అన్నీ వాళ్ళ కోసమే. ఆ పిల్లలకీ యితనంటే అంతప్రేమా, సంతోష మూను. అతన్నెరిగిన వాళ్లందరూ అతను చాలా అదృష్ట వంతుడనుకునే వాళ్లు.

చదువుకోసం పిల్లల్ని రాజోలులో వొదిలి, ఆఫీసు బోటులో తనూ, భార్యా, పసికుర్రాడూ సర్కీటు వెళ్లారు. ఒకరోజు రాత్రిపడ్డాక వొస్తానన్నవాడు పనితొరగా ముగియ డంచేత, వెంకటబ్రహ్మం మధ్యాహ్నం నాలిగింటికే వొచ్చి తనరైటరు, తనపడక గదిలోనించి, తొరతొరగా ఆఫీసుగది లోకి పోవడం చూశాడు. తరవాత రెండు రోజులు జాగ్ర త్తగా కనిపెట్టేప్పటికి, అతని అనుమానం నిశ్చయమయింది. అతనివొళ్లు వెర్రెత్తింది. మొదటినించీ తన భార్య సుభద్ర ప్రవర్తన తలుచుకుంటే, అన్నీ అనుమానంగానే కనపడ్డాయి, యిప్పుడు. ఆరైటర్ని చూస్తే వెంకటబ్రహ్మానికి అసలే చాలా అసహ్యం. తన భార్య అట్లాంటివాణ్ణి యేరుకోడం చాలా నీచంగా తోచి బాధపడ్డాడు. సుభద్రని తిట్టినా, కొట్టినా, చావతన్నినా, యేమీ లాభం లేదని అతనికి పూర్వానుభవం

వల్ల తెలుసు. అదిగాక పెద్దదై, ముగ్గురు పిల్లల తల్లి అయి, యిన్నాళ్ళు అతనితో కలిసి కష్టసుఖాలు పంచుకున్న దాన్ని చెయ్యిచేసుకోడం అతనికి మనస్కరించలేదు. ఆలోచించి ఆలోచించి అట్లాంటివి సాగడానికి వీల్లేదని కఠినంగా భార్యతో చెప్పాడు.

యిప్పుడు వెంకటబ్రహ్మంగారికి గుండెల్ని పీక్కుతినే పెద్దసందేహం ఒకటి పట్టుకుంది. యీముగ్గురు పిల్లలూ తన పిల్లలవునా, కాదా అని. వాళ్లలో తనవాళ్లెందరో కానివాళ్లెందరో పూర్వపు సందర్భాలన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాడు. వాళ్లు దగ్గరికి వొచ్చినప్పుడల్లా తన మొహం వాళ్ల మొహాలు పరకాయించి పోల్చుకని, పగధ్యానంలోపడేవాడు. వాళ్ళ మీాది అపారమైన ప్రేమ, వాళ్ళు తనవాళ్ళు కారేమో, యిన్నాళ్ళూ యెవళ్లనో, తన బిడ్డలని పిలుస్తో, ప్రేమిస్తో, వాళ్ళకోసం తన శక్తినంతా యిచ్చేసి, బాధలు పడడం— యివన్ని అతన్ని నరకబాధ పెడుతున్నాయి. తన భార్యని నిజం చెప్పమని అడిగితే చెబుతుందా? అందులో యింత పోట్లాటగా వున్నప్పుడు!

వారం రోజుల్లో తన భార్య నడవడి యథాప్రకారంగానే వుందని అతనికి బాగా తెలిసింది. యీసారి చాలా కఠినంగా మాట్లాడేటప్పటికి "సరేలే, నేనే బైటికి వెళ్ళిపోతా" నంది సుభద్ర. ఆమాటతో పులివంటి వెంకటబ్రహ్మంగారి దూకుడంతా అణిగింది. యీఅసహ్యం పడలేక, పొమ్మనాలని నాలిక దాకావొచ్చింది. కాని వెంటనే, వేరే ఆలోచన వొచ్చింది. తన పరుపుసంగతి తలుచుకున్నాడు. యీకాస్సె

కట్లూ, చివరికి పోలీసుజవాన్లూ, తనవ్యవహారం గుంపులు గుంపులుగూడి మాట్లాడుకోడం, తనముందు శాల్యూటుపెట్టి, వెనకాలే నవ్వడం, తన బంధువులు తనని వోదార్చడం, "పెళ్ళాన్ని అదుపులో పెట్టలేనివాడు వూళ్ళని అదుపులో పెడతాట్ట!" అనుకోడం అన్నీ కళ్ళకు తట్టాయి. తెలివిగా అప్పటికి వూరుకుని తరవాత చెయ్యవలసిన సంగతేమిటని ఆలోచించి, ముందు ఆ రైటరుమీద రిపోర్టు రాసి బదిలీ చేయించాడు. అతను వూరంతా గోలపెట్టి శెలవతీసుకొని అక్కడే వున్నాడు. అతన్ని తన్నించాలని చూశాడు. కాని అతను చాలామందికి యిష్టుడు కావడంచాతా, జాగ్రత్తగా వుండడం చాతా, అది చాతకాకపోయింది. తన యింటిలోనే వాణ్ణి పట్టుకుని తన్నడానికి సిద్ధమైతే, భార్య పిల్లలతోసహా రోడ్డుమీదపడి యేడ్చి గోలచేసేటంత వరకై, సిగ్గుపడి వూరుకున్నాడు. యిల్లు నరకమై పోయింది. భార్య మొహం చూసినప్పుడల్లా కొరికి చీల్చి, యేడిపించాలన్నంత కోపమైపొయ్యేది. కాని ఒక్కమాటంటే లేచిపోతుందని భయం. ఆపిల్లల్ని చూడగానే, వాళ్లు 'నాన్నా', అని యెప్పటి ప్రేమతోవచ్చి మెడని కావిలించుకోగానే, వొళ్లంతా జెర్రులుపాకినట్లవుతుంది. కాని వాళ్లని వొదల్లేదు. వాళ్ళ ప్రేమ లేకండా ఉండలేడు. ఆ రైటరు శెలవయెప్పుడైపోతుందా అని ధ్యానం చేసుకుంటో యీ బాధనంతా భరిస్తున్నాడు. వూరంతా యితనంటే నవ్వులాటై పోయినట్టుంది అతనికి. వీపు వెనకాల, 'రైటర్' అని కాకలు వేస్తున్నారనుకున్నాడు. గోడలమీదా, రైలుబళ్ళల్లో, భార్యపేరు వెలుగుతోంది. శలవ

అయిపోగానే రైటరు పనికి రాజీనామాయిచ్చి చీరెలకొట్టు పెట్టాడు. ఆరైటర్ని చంపెయ్యాలన్నంత కోపమొచ్చేది. ఒక్కొక్క రాత్రి నిజంగా యేకోప లోనో యేదో చేస్తానని అతనికి భయం కలిగింది. ఏంచెయ్యాలి?

పోనీ, తాను బదిలీ తెప్పించుకుంటే? బావుంది. పైకి వ్రాశాడు. వాడూవాొస్తే ఆకొత్తవూరు ? కాని పరాయి వూళ్ళో వాణ్ణి నడుం విరిగేటట్టు తన్నించడం యోగొప్పకాదు.. ప్రయత్నించగా ప్రయత్నించగా మూణ్ణెల్లకి విశాఖపట్నం మార్చారు. ఆబదిలీతో వెంకట బ్రహ్మానికి తన చిక్కులన్నీ తీరినట్టు, ప్రపంచంలో మళ్ళీ ఆనందమూ, ఆరోగ్యమూ, శాంతీ, వున్నట్టు తోచింది. ఇప్పుడేం చేస్తుంది? తన భార్య పొందగల దిగులును చూసి అతనికి చాలా సంతోషం పొంగి పొంగి వొచ్చింది. కానీ, దీని పని ఆవూళ్ళో పట్టించాలి.

తీరా ప్రయాణమయ్యేసరికి, సుభద్ర ఆవూరినుంచి కదిలి రానంది. ఆమాటతో అతనికి గుండె ఆగిపోయింది. అంతసాహసం చేస్తుందని అతను కలలోకూడా అనుకోలేదు. బహిరంగంగా తనని వొదలి వాడితో వుంటుందా?

"నువ్వు రానంటేమాత్రం, నేను వెళ్ళక యెట్లా తప్పుతుంది ? "

"వెడితే వెళ్లండి, వుంటే వుండండి, నేనీవూరు విడిచి రాను. "

తనలో ఏంలోపముంది? అతనిలో యేంవిశేషముంది? లేక ఆ స్త్రీ స్వభావమే అదా ? మళ్లీ తను కోరినప్పుడల్లా మాట్లాడకండా లోబడుతుంది. తను దగ్గిరచేరకపోతే లక్ష్యం

చెయ్యాను, కులాసాగా తనతో అనుభవిస్తుంది. వాడితోనూ అనుభవిస్తుంది. ఒకరాత్రి దయగా అడిగాడు ఆమెని—

“ఎందుకు అతన్ని వదలలేవు? నన్ను చూస్తే అసహ్యమా?”

“లేదు.”

“ఐతే?”

“మీకు తెలీదు. చెప్పడం నాకు తెలీదు.”

ఆమెని లాక్కెళ్లాలని చూశాడు. అల్లరికింద దిగింది. రోడ్డుమీద రాగాలు పెట్టే విషయం కిందకి వొచ్చింది. ఆఖరు నాటి రాత్రి భార్య కాళ్లమీదపడి బతిమాలాడని కూడ అంటారు. కాశీకిపోయి సన్యాసం పుచ్చుకోడానికి నిశ్చయించుకుని సగందూరం బయలుదేరాట్ట. పిల్లలమీది ప్రేమ ఆ నిశ్చయాన్ని చెడకొట్టింది. ఆ పిల్లల్ని తీసుకుని విశాఖపట్నం వెళ్లిపోయినాడు. ఒక వంట ఆమెనీ, ఆయానీ యేర్పరుచుకుని స్థిరపడ్డాడు. పదిహేను రోజుల్లో బతుకు దుర్భరమైపోయింది. కచేరికి పిల్లలు కదలనిచ్చేవాళ్లుకాదు. సైకిలెక్కి బయలుదేరితే ఆయా చేతుల్లో నిలవక యేడుస్తూ రోడ్డువెంట పడతారు. కచేర్నుంచి రాగానే, ఆముగ్గురూ యితన్ని కావిలించుకుని, “అమ్మ, అమ్మ,” అని ఒకటే గుండె కరిగేట్టు యేడుపు. చంటిపిల్లవాడు దిగులుతో శల్యమౌతున్నాడు. ఆ నౌకర్లు యీ పిల్లల్ని సరిగా చూట్టంలేదని, నౌకర్లని మార్చి నౌకర్లనిపెట్టినా, లాభంలేదని తెలిసింది. తను యెన్నడో మరిచిపోయిన బంధువుల నందరినీ ముఖ్యం ముసలి వితంతువులని, జాపకం తెచ్చుకుని, రప్పించాలని చూస్తే, ఒక్కరూ దొరక

లేదు. అసలు బంధువులు తక్కువ; వుద్యోగ గర్వంలో వాళ్లతో యెక్కువ సంబంధం పెట్టుకోలేదు. వాళ్లందరికీ యీ గోలంతా తెలిసి, యితన్ని సగం వెలిపడ్డ వాడివలె చూస్తున్నారు. రాజమహేంద్రవరం శరణాలయానికి వెళ్లి, వితంతు వివాహం చేసుకుంటా నన్నాడు. యితని చరిత్ర విని, ఆ భార్యనంత చక్కగా చూసుకున్నావు, యింక యీ భార్యని యెంత బాగా చూసుకుంటావో, వెళ్లమన్నారు. సిగ్గేసి యింటికొచ్చాడు. పిల్లలు అన్నం తినటంలేదు. ఆడుకోరు. రాత్రులు ముగ్గురూ వూపిరాడ కండా చుట్టూ కావిలించుకుని గాని నిద్రపోరు, యిట్లా యింకో పదిరోజులు యేడిపించేప్పటికి, వాళ్ల మీది ప్రేమ అంతా యెగిరిపోయింది. వాళ్ల మొహాలు కనపడేప్పటికి యెక్కడికి పారిపోదామా అనిపించేది. ఆఫీసునించి యింటికి వెళ్లడమంటే హడలుగా వుంది. ఆ తల్లిలేని పిల్లల్ని తనుకూడా విసుక్కోడం, కొట్టడం సాగించాడు. అంతేగాక, వీళ్లు తన బిడ్డలవునా కాదా, యీ శ్రమలూ, బాధలూ, యెవరెవరి పిల్లలకోసమో పడుతున్నానా, అనేసంగతి అతని హృదయాన్ని ఒక్క నిమిషం బాధించడం మానలేదు. రాత్రులు నరాలు లాగి, గుండె పట్టుకుని, నిద్రపట్టక, బాధపడతాడు. లాంతరు తీసుకొచ్చి భద్రంగా వాళ్ళ మొహాలు వెతుకుతాడు. యీ పిల్లల్ని వొదిలి తన భార్య యెట్లావుందా అని ఆశ్చర్యమూ, నిలవలేక వొచ్చేస్తుందేమోననే ఆశా, మళ్లీ రానిస్తానా అనే కోపమూ, పిల్లలమీదవున్న ప్రేమనంతా చంపుకున్న ఆస్త్రీ వికృత స్వభావానికి అసహ్యమూ, యిన్ని భావాలూ అత

నిలో పుదుతో ఉంటాయి. ఆముగ్గురికీ ఫొటో తీయించి భార్యకి ఫొటోగ్రాఫర్ని పంపమన్నాడు. యెందుకో బాగా తెలీదు. యేవేవో కారణాలు చెప్పుకుని సమాధాన పెట్టుకున్నాడు. యెంత అక్కర్లేకపోయినా తల్లి కదా, పిల్లల్ని చూడాలని వుండదా, ఆమెకి హృదయం లేకపోతే తనకిలేదా అనుకున్నాడు. యింతలో రెండోపిల్లవాడికి హఠాత్తుగా పెద్ద జ్వరం వొచ్చింది. సెలవ పుచ్చుకుని రాత్రింబవళ్ళు అతనికి సేవచేశాడు. ఒకరోజు రాత్రి ఆపిల్లవాడిపక్కన కూచుని వుండగా ఆ జబ్బూ, అకుర్రవాడి అసహాయత్వం, వాడి అమాయకమైన ప్రేమా, అన్నీ తలుపుకు వొచ్చాయి. అమ్మదగ్గిర్నించి యెందుకు తీసుకొచ్చావని అడగరు, మమ్మల్ని వొంటరిగా నౌకర్లమీద పారేసి, కష్టాలు పెట్టడానికి నీకు చేతు లెట్లా వొచ్చాయి అనరు, యెందుకు యిట్లా కొడతావు, తిడతావనరు, తనని నమ్మి యిట్లా జబ్బులు తెచ్చుకుని, ఆ చేదు మందులు గొంతుకలో పోసుకుంటూ, చావుకుకూడా సిద్ధమవుతారు. వేంకటబ్రహ్మనికి యెంతో యేడుపొచ్చింది. ఆ అబ్బాయిని విసుకుతో తను కొట్టిన దెబ్బలూ, ఆబాధ పడలేక వాడు పెట్టిన మొహమూ, అన్నీ జ్ఞాపకం వొచ్చి, యేడ్చాడు. యిక తన దగ్గిర పిళ్ళని వుంచుకో కూడదు; తన పరువుపోయినా సరే, అనుకుని, ఆజబ్బు నయంకాగానే, ముగ్గురు పిల్లల్నీ, తీసుకుని ఆ రైటరూ, తన భార్య తను పూర్వంవున్న యింట్లోనే కాపరం చేస్తోవుంటే, అక్కడికి వెళ్ళాడు. రైటర్ని 'పర్మిషన్' అడిగి, ఆమెతో మాట్లాడి, సగం జీతం పంపేందుకు వొప్పుకుని, ఆపిల్లల్ని ఆమెదగ్గిర దిగపెట్టాడు. ఆరోజు

రాత్రి యితన్ని వాళ్ళు అక్కడే భోజనానికి వుండమన్నారు, కాని అతను వుండలేదు.

ఆ పిల్లల్ని దిగపెట్టి వొచ్చిననాటినుంచి వాళ్ళమీద మళ్ళీ అమితమైన ప్రేమ మొదలుపెట్టింది. వాళ్ళేమీ అల్లరి చెయ్యలేదనీ, తనే అన్యాయంగా వాళ్ళని బాధపెట్టాననీ అనుకున్నాడు. వాళ్ళని మళ్ళీ చూడాలనే కోర్కని అణుచుకోలేక అవస్థపడ్డాడు. మెల్లిగా మరిచిపోయినాడు. మూడేళ్లు మెల్లాగైతేనేం తోసుకుతిరిగాడు. తరువాతవాళ్లని వొక్కసారన్నా చూడకుండా వుండడం అసాధ్యమై పోయింది. వాళ్లు బతికివున్నారో లేదోకూడా తెలీదు.

యెవరన్నా ఆ వూరి స్నేహితుల్ని తన పిల్లలెట్లా వున్నారో చూసి, రాయమంటే యెట్లావుంటుంది? తను ఆవూరు వెడితే అందరూ తెలిసి నవ్వుకోరూ? ఒకరోజు తన పెద్దబ్బాయి బళ్ళో కుర్రాడితో పోట్లాడి, దెబ్బలుతిని యింటికి వెళ్ళినట్టూ, యింట్లోవాళ్లు కూడా చీవాట్లు పెడితే, తనని తలుచుకుని యేడుస్తున్నట్టూ, కలవొచ్చింది. కలలోంచి మెళుకువ రాగానే, పిల్లలకోసం, వేదన ప్రారంభమయింది. ఆ రైటరూ తనభార్య, తనపిల్లల్ని యెంత బాధపెడుతున్నారో, అని భయంపట్టుకుంది. ఆపిల్లలు తనకోసం యేడుస్తున్నట్టే వుంది. మర్నాడు రాజోలు రాత్రికి చేరుకునేట్టు ప్రయాణమైనాడు. దొంగతనంగా వాళ్లయింటి కిటికీదగ్గిర చీకట్లోనుంచుని, లోపలికి చూశాడు. రైటరు చుట్ట కాలుస్తూ వరండాలో కుర్చీలో పడుకున్నాడు. తన పెద్దకుర్రాడు గదిలో పాఠంచదువుకుంటూ అప్పుడప్పుడు ఆరైటర్ని 'బాబాయ్' అని పిలిచి సందేహా

లడుగుతున్నాడు. సుభద్ర ఆగదిలోనే మంచంమీద కూచుని చిన్నపిల్లకి పాటనేర్పుతోంది. రెండో కుర్రాడు ఆ రైటరు సైకిలు గోడనానించి వుంటే, యెక్కాలని ప్రయత్నం చేస్తున్నాడు. యిదంతా వెంకటబ్రహ్మంగారు చూశాడు. ఆయిల్లు యెంతో 'కంఫర్టబుల్' గా సుఖంగా వున్నట్లు కనపడ్డది. ఆ సంసారం, ఆ ఆనందం, ఆ మూడేళ్లు వొదలుకుని యేకాకినైన్నాను కదా అన్న దిగులేసింది. సుభద్రమ్మకూడా యిదివరకటికంటే అందంగా కనబడుతోంది. యింత పెద్దలోకంలో తన వొంటరితనం ఘోరంగా తట్టింది మనసుకి. కాంతిలో స్వర్గంలో వాళ్ళుంటే, చచ్చిపోయినవాడి దెయ్యంలాగు తనిం కేదోలోకం నించి దిగివొచ్చి వాళ్ళని, తనవాళ్ళని, చూస్తున్న ట్లయింది. గుండెలు పీక్కుపోయినాయి. ఒక్కసారి ఆపిల్లల్ని కావలించుకోవా లనిపించింది. క్లైవు తెచ్చిన 'రిఫారాలు' యేమిటో ఆ పెద్దకుర్రాడికి విప్పిచెప్పి, ఆచిన్నకొడుకుని వొళ్లో కూచోపెట్టుకొని, ఆ రెండోవాణ్ణి సైకిలుమీద పడకండా నిలపెట్టాలని కోర్కె యేడిపించింది. చివరకి ఆయింటో కాలుపెట్టడానికి తనకర్హత లేదనుకొని వెళ్ళిపోయి, ఆరాత్రే రైలెక్కాడు.

వాళ్లనిచూసిన తరవాత అతని జీవితం దుర్భరమైపోయింది. ప్రతినిమిషమూ బతుకు వొంటరిగా వున్నదనిపిస్తోంది. సంపాయించడం యెందుకు ? యీ నౌకరెందుకు ? హోదాయెందుకు ? హోటళ్లలో భోజనం, యెక్కడో గదిలో నిద్ర ! సంసారాల్లోకి యితన్ని రానీరు. యెవరూ శుభకార్యాలకాట్టె పిలువరు. పిలిచినా బంధువుల్ని చూడ్డానికి సిగ్గు. నా వాళ్లనుకునే వాళ్లులేరు. 'ప్రమోషన్' వొస్తే సంతోషం.

చెప్పుకునేందుకన్నా యెవరూ లేరు. మంచిచీర చూస్తే నగలు చూస్తే, బొమ్మలుచూస్తే, యెవరికన్నా కొనిపెట్టాలని పించేది. జబ్బుచేస్తే, యెట్లావుందని పలకరించేవాళ్లు లేరు. ఆపిల్లలు కావాలి కావాలని రాత్రింబవళ్లు అరిచేది హృదయం. వాళ్లలో ఒక్కరన్నా తనసొంతపిల్లలై వుంటారని నిశ్చయించుకున్నాడు. సంగతులన్ని జ్ఞాపకము తెచ్చుకుని వాళ్ళ ఫోటోలు, తన ఫోటో దగ్గరగా పెట్టుకొని పోలికలు చూసుకుంటాడు. కాని యేంచేస్తాడు? అట్లానే కుళ్లుతో కాలం గడుపుతున్నాడు.

తరువాత నాలుగేళ్ళకి పాపం ఆరైటరు చచ్చిపోయి నాడు. తరవాత రెండునెలల్లో వెంకటబ్రహ్మం సుభద్రా వెంకటబ్రహ్మం ముగ్గురు కొడుకులూ, ఆరైటరుకి పుట్టిన చంటిపిల్లా అందరు సుఖంగా కాపరంచేస్తున్నారు. వెంకట బ్రహ్మం పెన్షన్ పుచ్చుకుని, ఆపాతయింట్లోనే స్థిరపడ్డాడు. యిప్పుడుకూడా వాళ్లహాల్లో ఆరైటరుది పెద్ద ఫోటోవుంది. వెంకటబ్రహ్మంగారి ముగ్గురుపిల్లలూ ఆరైటర్నే బాబాయి అంటారు. ఆరైటరు కూతురుమాత్రం యీయన్ని 'నాన్నగా' రంటుంది.

౩. నేనూ, మా ఆవిడా మిగిలాం

౧

నేను అందమైనవాణ్ణనిగాని, నా రూపం యింకొకర్ని ఆకర్షిస్తుందనిగాని, నేనెన్నడూ అనుకోలేదు. అనుకోడం అసంభవం.